
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
3★★★ జిల్లా వార్తలు
సోమవారం 16 సెప్టెంబరు 2024



నిండుకుండలా మిడ్ మానేరు - 5లో..
ధర్మగుండంలో గణపయ్య నిమజ్జనం - 5లో..

గణేష్ నిమజ్జనానికి సర్వం సిద్ధం



బ్యాక్‌వాటర్‌తో మునిగిన ఏర్పాట్లు

సిరిసిల్ల మానేరు వాగులో నిమజ్జన ఏర్పాట్లు

- నేడు వేములవాడ.. రేపు సిరిసిల్లలో
- జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు
- సిరిసిల్ల మానేరు వాగులో ఏర్పాట్లకు ఇబ్బందులు
- మిడ్ మానేరు బ్యాక్ వాటర్‌తో విఘాతం
- జిల్లా వ్యాప్తంగా భారీ విగ్రహాల ఏర్పాటు
- భారీ బందోబస్తు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

గణేష్ నిమజ్జనోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా భారీ ఏర్పాట్లు చేశారు. ఆదివారం కొన్ని గ్రామాల్లో నిమజనం మొదలైనా ప్రధాన కార్యక్రమం జిల్లాలోని వేములవాడ పట్టణంలో సోమవారం, జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించనున్నారు. వేములవాడలో రాజరాజేశ్వరస్వామి దేవ స్థానం గుడిచెరువులో నిమజ్జనానికి ఏర్పాట్లు చేశారు. జిల్లా కేంద్రంలో సిరిసిల్ల మానేరు వాగు తీరంలో మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. నిమజ్జన ఏర్పాట్లను ఇప్పటికే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్ పరిశీలించారు. గ్రామాల్లో గామపంచాయతీ అధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

● ముందస్తుగా నిమజ్జనాలు

జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ, ముస్తాబాద్, ప్రాంతాల్లో నిమజ్జనాలు మొదలయ్యాయి. వివిధ వాణిజ్య సంస్థలు, పాఠశాలల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల నిమజ్జనం మూడో రోజు నుంచే మానేరు వాగులో నిమజ్జనం చేస్తున్నారు.జిల్లా కేంద్రంలోని వివిధ ప్రాంతాల్లో ప్రతీ రోజు మండపాల వద్ద దాండియా, కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు సందడి చేశాయి.

● సిరిసిల్లలో ఏర్పాట్లకు విఘాతం

జిల్లా కేంద్రంలో వాడవాడనా భారీ విగ్రహాలను ఏర్పాటు చేసి నవ రాత్రి ఉత్సవాలను వైభవంగా జరుపుకుంటున్నారు. మంగళవారం నిర్వహించనున్న నిమజ్జనోత్సవానికి సిరిసిల్ల విద్యానగర్ మానేరు తీరంలో నాలుగు రోజులుగా ఏర్పాట్లు చేస్తున్నారు. మిడ్ మానేరు బ్యాక్ వాటర్ తక్కువగా ఉండడంతో ఇబ్బందులు ఉండవని భావించారు. ఆది వారం ప్రాజెక్ట్‌లోకి భారీగా నీళ్ల చేరడంతో సిరిసిల్లలో చేసిన ఏర్పాట్లు నీట మునిగాయి. ఈ నెల 24వ తేదీలోగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిరిసిల్లలో జిల్లా పోలీస్ కార్యాలయం తోపాటు మల్కపేట రిజర్వాయర్ ప్రారంభోత్స వానికి రానున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే మల్కపేట రిజర్వా యర్‌లోకి నీటిని నింపడానికి మిడ్ మానేరు ప్రాజెక్ట్‌ను పూర్తి స్థాయిలో నింపుతున్నారు. దీంతో మిడ్ మానేరు బ్యాక్ వాటర్ సిరిసిల్ల గంగమ్మ గుడి వరకు చేరుకుం టోంది. ఈ క్రమంలో బ్యాక్ వాటర్‌లో నిమజ్జనం ఏర్పా ట్లు మునిగిపోయా యి. దీంతో మున్సిపల్ ఆధ్వ ర్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. 27.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న మిడ్ మానేరు ప్రాజెక్ట్‌లో 26.19 టీఎంసీల నీరు చేరింది. శ్రీరాంసాగర్ వరదకాలువ ద్వారా 13,700 క్యూసెక్కుల వరదనీరు వ స్తోంది. ప్రాజెక్ట్ నుంచి అన్నపూర్ణ ప్రాజెక్ట్‌లోకి 6400 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉంది. మిడ్ మానేరు ప్రాజెక్ట్‌లోకి 27 టీఎంసీల వరకు వరద కాలువ ద్వారా నీరు చేరితే విద్యానగర్ వద్ద మానేరులో వినాయక నిమజ్జనం ఇబ్బంది కరంగా మారే పరిస్థితులు ఉన్నాయి. అధికారులు మాత్రం ఇబ్బందులు కలగకుండా నిమజ్జనం జరిగే వి ధంగా భారీ క్రేన్లను సిద్ధం చేస్తున్నారు. లైటింగ్, జనరేటర్ సౌకర్యాలతో పాటు అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టారు.

● సంబరాలు కారాదు ప్రమాదం

జిల్లా వ్యాప్తంగా నిమజ్జనోత్సవ సంబరాల్లో ప్రమాదాలకు చోటివ్వద్దని అధికారులు సూచనలు చేస్తున్నారు. వినాయకుని ఊరేగింపులో అప్రమత్తతతో వ్యవహరిస్తే ప్రమాదాలకు చోటు లేకుండా ప్రశాంతంగా జరుపుకో వచ్చని పేర్కొంటున్నారు.

● వైభవంగా నవరాత్రోత్సవాలు

వినాయక నవరాత్రి ఉత్సవాలను జిల్లాలో వైభవంగా కొనసాగుతున్నాయి. జిల్లాలో దాదాపు 3 వేల వరకు భారీ నుంచి చిన్న విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తున్నారు. హోమాలు, కుంకుమ పూజలు, నిత్య అన్నదానాలు, ప్రత్యేక కార్యక్రమాలు చేస్తున్నారు. భారీ సెట్టింగ్‌లు వేశారు. జిల్లా కేంద్రంలో ఒక్కో విగ్రహానికి దాదాపు రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు ఖర్చు చేశారు. జిల్లాలో చిన్న చిన్న విగ్రహాలకు కొదవ లేదు. భారీ విగ్రహాలే జిల్లా కేంద్రంలో 400 వరకు ఉన్నాయి. 300 వరకు వేములవాడలో ఉన్నాయి. మండలాలు, గ్రామాల్లో 2 వేలకు పైగానే ఉన్నాయి. చిన్న చిన్న విగ్రహాలు, మండపాలకు కొదవ లేదు. ఏ గ్రామానికి వెళ్లినా ఏ రోడ్డువైపు వెళ్లినా వినాయక విగ్రహాలు దర్శనమిచ్చాయి.

నీళ్లతో జాగ్రత్త

వినాయక విగ్రహాలను సిరిసిల్లలో మానేరువాగు, వేములవాడ ప్రాంతంలో మూలవాగు, గ్రామాల్లో చిన్న చిన్న చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేస్తారు. నిమజ్జన సమయంలో నీటి ప్రవాహాల వద్ద జాగ్ర త్తలు పాటించాలి. నీటి లోతు ముందుగానే తెలుసుకోవాలి. ఈత వచ్చిన వారిని ముందుగానే సిద్ధం చేసుకోవడంతో అత్యవసర సమయాల్లో ఇబ్బందులు తలెత్తవు. మద్యం తాగి ఉన్నవారిని నిమజ్జనం ఛాయలకు రానివ్వవద్దు. గొడవలు తలెత్తకుండా చూసుకోవాలి. నిమజ్జనోత్సవం నిర్వహించే ఊరేగింపులో పోలీసులకు సహకరిస్తే శోభయాత్రలు సాఫీ గా సాగిపోతాయి. వినాయకుల నిమజ్జనానికి తరలివెళ్లే భక్తులు పలు జాగ్రత్తలతోపాటు అధికారులు, పోలీసులు సూచనలు పాటించాలి. నిమజ్జనానికి వెళ్లే సమయంలో వాహనాలను ఓవర్‌టేక్ చేయవద్దని, రోడ్ల పక్కన నిలపవద్దని సూచనలు చేస్తున్నారు. మద్యం తాగి వాహ నం నడపవద్దని సూచనలు చేశారు. పిల్లలు, మహిళలు, గర్భిణులు అప్రమత్తంగా ఉండాలని, వాహనాలకు దూరంగా ఉండడం మంచిదని పేర్కొన్నారు. నిమజ్జనానికి వెళ్లే వారు ఇంటివద్దనే ఆహారం తిని వెళ్లడం మంచిదని, రోడ్డు పక్కనే తినే ఆహారంతో ఇబ్బందులు కలిగే అవకాశం ఉంటుందని సూచించారు.

వినాయక నిమజ్జనానికి భారీ బందోబస్తు

● డీజేలకు అనుమతి లేదు ● ఎస్పీ అఖిల్‌మహాజన్



సిరిసిల్లలో నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్, ఎస్పీ (ఫైల్)

గణేష్ నిమజ్జనోత్సవంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పూర్తిస్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ అఖిల్‌మహాజన్ తెలిపారు. మండపాల నిర్వాహకులు, భక్తులు పోలీసుల సూచనలు పాటిస్తూ సమయానికి నిమజ్జనం పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 2200 వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారని, జిల్లా కేంద్రంలో 400, వేములవాడ పట్టణంలో 300 వరకు ఉన్నాయని అన్నారు. శాంతియుత వాతావరణంలో శోభాయాత్ర సాగేలా పోలీసులకు మండపాల నిర్వాహకులు సహకరించాలని సూచించారు. నిమజ్జనం రోజున డీజేలకు అనుమతి లేదని, సమయానికి నిమజ్జనం పూర్తి చేయాలని అన్నారు. శోభాయాత్ర సమయంలో ఇతరుల మనోభావాలు దెబ్బతీయకూడదన్నారు. పాటలు వినిపించడంతోపాటు బాణసంచాతో ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. మద్యం తాగి శోభాయాత్రలో ఇబ్బందులు కలిగించవద్దన్నారు.

రాజన్న సన్నిధిలో భక్తుల రద్దీ



స్వామివారి దర్శనం కోసం నిరీక్షిస్తున్న భక్తులు

వేములవాడ, సెప్టెంబరు 15: వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రం ఆదివారం భక్తులతో రద్దీగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు తమ ఇష్ట దైవమైన రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు అందుకుంటున్న బొజ్జ గణపయ్యను దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో వినోద్ రెడ్డి నేతృత్వంలో అధికారులు ఏర్పాట్లు చేశారు.

ముగిసిన రేషన్ డీలర్ల రాత పరీక్ష

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 15 : జిల్లా వ్యాప్తంగా రేషన్ దుకాణాల డీలర్ల ఎంపిక కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఆదివారం ఆర్డీవో రమేష్‌కుమార్ పర్యవేక్షణలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో రాత పరీక్ష నిర్వహించారు. జిల్లా కేంద్రంలో కుసుమ రామయ్య హై స్కూల్, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, గీతానగర్ జడ్పీహెచ్ బాలికల హై స్కూల్‌లో అభ్యర్థులకు ఎంపిక రాత పరీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 830 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోగా 765 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రాత పరీక్ష ఫలితాలను త్వరలో ప్రకటించనున్నట్లు, ఇంటర్వ్యూలను పారదర్శకంగా నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఆకట్టుకుంటున్న పరమశివుడి విగ్రహం



పూజలు నిర్వహించిన నాయకులు, స్థానికులు

సిరిసిల్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కైలాసగిరి పరమశివుడు విగ్రహం అందరినీ ఆకట్టుకుంటోంది. ఆదివారం సిరిసిల్లలోని గీతానగర్, విద్యానగర్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో 45 సంవత్సరాలుగా వినాయక నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ప్రతి సంవత్సరం ఒక ప్రత్యేకతను చాటుకునే కమిటీ నిర్వాహకులు ఈసారి కైలాసగిరి పరమశివుడి వంటి భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పరమశివుడికి లింగార్చనను నిర్వహించారు. సిరిసిల్లలోని వివిధ ప్రాంతాల నుంచి పరమశివుడి విగ్రహాన్ని చూడడానికి పెద్ద సంఖ్యలో వచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జింద కళాచక్రపాణి, టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దూస భూమయ్య, జిందం దేవదాస్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి
అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 15 : సిరిసిల్ల పట్టణం మినీ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు ఆదివారం ఉత్సాహంగా ముగిశాయి. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. మినీ స్టేడియంలో ఉదయం అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు గొట్టె రామచంద్రం ప్రారం భించారు. అండర్-14, 16, 18, 20 వయస్సులోపు వివిధ విభాగాలలో పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారికి అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ 30 మంది క్రీడాకారులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ నెల 19, 20 తేదీల్లో హైదరాబాద్ ఉస్మానియా యూనివర్శిటీలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అర్గనైజింగ్ సెక్రెటరీ కనకం శ్రీనివాస్, సభ్యుడు అజయ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు అశోక్, శ్రీనివాస్, సాయికుమార్, రాజు పాల్గొన్నారు.

వేలాడుతున్న విద్యుత్ తీగలు, ఒరిగిన స్తంభాలు



పొలాల్లో కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు, ఒరిగిన విద్యుత్ స్తంభం

రుద్రంగి, సెప్టెంబరు 15: వ్యవసాయ భూముల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలు, ఒరిగిన స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. సంబంధిత అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదని రైతులు ఆందోళన వ్యకం చేస్తున్నారు. రుద్రంగి మండల కేంద్రంలోని బతుకమ్మ కుంట చెరువు, నందివాగు సమీపంలోని పొలాల్లో విద్యుత్ తీగలు నేలను తాకుతున్నాయి. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు పక్కకు ఒరిగి ఎప్పుడు కింద పడిపోతాయో తెలియని పరిస్థితి. కొన్ని చోట్ల చేతులకు తాకే ఎత్తులో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు విద్యుత్ స్తంభాలు మరింత ప్రమాదకరంగా మారాయి. 10 రోజుల నుంచి విద్యుత్ సర ఫరా లేకపోవడంతో పొలాలకు నీరు అందక పంటలు ఎండి పోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించాలని, సమస్యను పట్టించుకోవాలని కోరుతున్నారు.

వినాయక నిమజ్జనం
ప్రశాంతంగా నిర్వహించాలి

ఇల్లంతకుంట, సెప్టెంబరు 15: వినాయక నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్సై శ్రీకాంత్ గౌడ్ అన్నారు. వినాయక ప్రతిమను నిమజ్జనం చేసే మండల కేంద్రంలోని ఎర్రగుంట చెరువును ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా నిర్వాహకులు వ్యవహరించాలన్నారు. విద్యుత్ వైర్లను జాగ్రత్తగా గమనించాలని సూచించారు. కుంటలలో నీరు ఎక్కువగా ఉన్నందున వినాయకులను నిమజ్జనం చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

కోనరావుపేట, సెప్టెంబరు 15:కోనరావుపేట మండల కేంద్రంలోని మోడల్ స్కూలుకు వెళ్లే ప్రధాన రహదారి సీసీ రోడ్డు నిర్మాణానికి కాంగ్రెస్ జిల్లా నాయకుడు చందనగిరి గోపాల్ ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నేళ్లుగా మోడల్ స్కూల్‌కు వెళ్లడానికి రహదారి లేక ఇబ్బందులు పడ్డారన్నారు. రోడ్డు నిర్మాణంతో విద్యార్థుల కష్టాలు తీరాయన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎంపీటీసీ దేవరకొండ నరసింహాచారి, శంకర్ గౌడ్, మాందాల శ్రీనివాస్, శంకర్ ఉన్నారు.

పల్లె దవాఖానా ప్రారంభమెప్పుడో?



తాళం వేసి ఉన్న పల్లె దవాఖానా భవనం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 15: పల్లె ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం పల్లె దవాఖానాలను ఏర్పాటు చేసింది. భవన నిర్మాణాలు పూర్తయిన ప్రారంభానికి నోచుకోలేకపోతున్నాయి. ఫలితంగా పల్లె దవాఖానలకు తాళం వేసి దర్శనమిస్తున్నాయి. ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్‌లో నిర్మించిన పల్లె దవాఖానా ప్రారంభం కాకపోవడంతో వైద్య సేవలు అందకుండాపోతున్నాయి. వ్యాధుల బారిన పడిన తమకు సకాలంలో ప్రభుత్వ వైద్యం అందక సుమారు 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత శాఖ అధికారులు స్పందించాలని, పల్లె దవాఖానాను ప్రారంభించి వైద్య సేవలు అందించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పంట రక్షణకు వినూత్న ఆలోచన



పొలంలో ఏర్పాటు చేసిన రంగురంగుల జెండాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 15: పొట్ట దశకు వచ్చిన పచ్చని పైరును దక్కించుకునేందుకు అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. పక్షులు వాలి పంటను నాశనం చేస్తుండడంతో వాటి నుంచి కాపాడుకునేందుకు కాపలా కాయాల్సి వస్తోంది. ఈ క్రమంలో ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులో ఓ రైతు వరి పంటను కాపాడుకునేందుకు వినూత్నంగా ఆలోచించాడు. పక్షులు బెదిరిపోయేలా పంట మధ్యలో రంగురంగుల జెండాలను ఏర్పాటు చేశాడు. జెండాలు ఎగురుతుండడంతో పక్షులు బెదిరిపోతున్నాయని పేర్కొంటున్నాడు.



'నవోదయ'లో కళోత్సవాలు ప్రారంభం

● వివిధ జిల్లాల నుంచి విద్యార్థుల రాక



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపాల్ మంగతాయారు

చొప్పదండి, సెప్టెంబరు 15: జవహర్ నవోదయ విద్యాలయంలో కళోత్సవాలు 2024 ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను ప్రిన్సిపాల్ మంగతాయారు, రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ దాస్యం సేనాధిపతి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. క్లస్టర్ స్థాయిలోని 9 జిల్లాల నవోదయ విద్యాలయాల నుంచి విద్యార్థులు ఈ ఉత్సవాలకు హాజరుకాగా వివిధ పోటీలో పాల్గొన్నారు. ఆదివారం ఆదిలాబాద్, రంగారెడ్డి, మెదక్, వరంగల్ విద్యాలయాల విద్యార్థులు పాటలు, చిత్రలేఖనం, నృత్యం పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కేబీ శర్మ, కట్ట మంజుల, సత్యనారాయణ, రాధాకృష్ణ వ్యవహరించారు. కాగా ఉత్సవాలు రెండురోజుల పాటు జరుగను న్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గల్ఫ్ కుటుంబాలకు ప్రాధాన్యమివ్వాలి

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 15: విదేశాల్లో ఉపాధి పొందుతూ, తెలంగాణ ఖజానాకు ఆదాయం సమకూర్చుతున్న గల్ఫ్ కుటుంబా లకు ప్రభుత్వం అండగా నిలిచి, సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ రాశారు. సుమారు 15లక్షల కుటుంబాలకు పైగా గల్ఫ్ దేశాలలో ఉపాధిని పొందు తున్నారన్నారు. సగటున ఒక్కో కుటుంబానికి నెలకు రూ.10వేల వేతనం పొదుపుగా భావించిన నెలకు రూ.1500 కోట్ల విదేశీమారక ద్రవ్యం సమకూర్చబడుతుందన్నారు. ఇదే లెక్కన ఏడాదికి 18వేల కోట్లు, గడిచిన పదేళ్ల తెలంగాణ పాలనలో సుమారు లక్ష80వేల కోట్ల ఆదాయం చేకూరిందనేది స్పష్టమవు తుందన్నారు. ఇందులో నుంచి ఏ మార్గం ద్వారా ఖర్చు పెట్టిన కనీసం 10శాతం అమ్మకపు పన్నుద్వారా సుమారు 18వేల కోట్లు ఆదాయం గల్ఫ్ కుటుంబాలద్వారా వచ్చిందని భావించక తప్పదన్నారు. ఇంత ఆదాయం రాష్ట్రానికి ఒనగూర్చిపెడుతున్న తెలంగాణ గల్ఫ్ బిడ్డలకు కనీసం ఒక్కపైసా లాభం ఒనగూర్చకపోవడం దురదృష్టకరం అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో గల్ఫ్ దేశాల్లో ఉపాధి పొందుతున్న బిడ్డలు దురదృష్టవశాత్తు గల్ఫ్‌లో మరణిస్తే వారికి కుటుంబాలకు రూ.5లక్షల ఆర్థిక సహాయం అందించడంతో పాటు, విదేశాల నుంచి తిరిగి వచ్చిన కార్మికులకు స్వదేశంలో స్థిరపడేందుకు స్వయం ఉపాధి పథకాల్లో ప్రాధాన్యత, వారి పిల్లలకు గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు ప్రాధాన్యత, గృహవసతి కల్పించడం ప్రభుత్వం బాధ్యతగా భావించాలన్నారు. వీటితో పాటు కేరళ రాష్ట్ర తరహాలో కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటుకు చొరవ చూపాలని కోరారు.


మత్స్యకారుడి వలకు చిక్కిన కొండచిలువ

గన్నేరువరం, సెప్టెంబరు 15 : మండల కేంద్రానికి చెందిన మత్స్యకారుడు రంగనవేణి రాజేశం ఆదివారం లోయర్ మానేరు డ్యాంలో చేపలు పట్టేందుకు వెళ్ళగా అతడు వేసిన వలకు భారీ కొండచిలువ చిక్కింది. వలకు చిక్కిన కొండచిలువ సుమారు మూడు మీటర్ల పొడవు ఉండడంతో తోటి మత్స్యకారుల సాయంతో బయటకు లాగారు. ఒడ్డుకు తీసుకెళ్లిన కొద్దిసేపటికే కొండచిలువ మృతి చెందినట్లు వారు తెలిపారు.





















వస్తోంది.. 'వందేభారత్'



- నాగ్‌పూర్ నుంచి సికింద్రాబాద్‌కు నడవనున్న రైలు
- నేడు నాగ్‌పూర్‌లో ప్రారంభించనున్న ప్రధాని నరేంద్ర మోదీ
- రాష్ట్రంలో రామగుండం, కాజీపేటలో మాత్రమే హాల్టింగ్ సౌకర్యం
- వారంలో మంగళవారం మినహా ఆరు రోజులు నడవనున్న రైలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

దేశంలోనే అత్యంత వేగంగా నడిచే రైలుగా పేరొందిన వందే భారత్ రైలు నాగ్‌పూర్ నుంచి సికింద్రాబాద్ వరకు నడవనున్నది. ఇప్పటివరకు రాష్ట్రంలో వందే భారత్ రైళ్లు విశాఖపట్నం-సికింద్రాబాద్, కాచిగూడ-తిరుపతి మధ్య నడుస్తున్నాయి. నాగ్‌పూర్-సికింద్రాబాద్‌కు నడిచే వందే భారత్ రైలును భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈనెల 16వ తేదీన గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో వర్చువల్‌గా సాయంత్రం 4.15 నిమిషాలకు పచ్చజెండా ఊపి ప్రారంభించనున్నారు. దీంతో పాటు అదేరోజు పూణె-హుబ్లీ, కోలాపూర్-పూణె వరకు కూడా మరో రెండు వందేభారత్ రైళ్లను ప్రారంభించనున్నారు. నాగ్‌పూర్ నుంచి సికింద్రాబాద్‌కు నడవనున్న వందే భారత్ రైలుకు తెలంగాణలో పెద్దపల్లి జిల్లా రామగుండంతో పాటు వరంగల్ జిల్లా ఖాజీపేటలో ఆగనున్నది. వారంలో మంగళవారం మినహా అన్ని రోజుల్లో నడవనున్నది. ఈ రైలు 20 కోచులతో గంటకు 130కిలోమీటర్ల వేగంతో ప్రయాణించనున్నది. రామగుండం నుంచి సికింద్రాబాద్‌కు 3 గంటల్లోనే చేరుకోనున్నారు. ఈ రైలును సోమవారం నాగ్‌పూర్‌లో ప్రారంభించిన తర్వాత రాత్రి 19:30 గంటలకు రామగుండం చేరుకోనున్నది. అక్కడ పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్‌సింగ్ స్వాగతం పలకనున్నారు. రెగ్యులర్‌గా ట్రైన్ నంబర్ 20101 నాగ్‌పూర్‌లో ఉదయం 5:43 గంటలకు బయలుదేరనున్నది. సేవగ్రామ్‌కు, 7:03 గంటలకు చంద్రాపూర్‌కు, 7:20 గంటలకు బల్లార్షకు చేరుకుంటుంది. అక్కడి నుంచి రామగుండంకు 9:08 గంటలకు చేరుకుని 9:10 గంటలకు బయలు దేరుతుంది. 10:04 గంటలకు ఖాజీపేటకు, మధ్యాహ్నం 12:15 గంటలకు సికింద్రాబాద్ చేరుకోనున్నది. తిరిగి ట్రెయిన్ నంబర్ 20102 సికింద్రాబాద్‌లో మధ్యాహ్నం 13:00 గంటలకు బయలుదేరి ఖాజీపేటకు 14:18 గంటలకు, రామగుండంకు 15:13 గంటలకు, బల్లార్షాకు 17:25 గంటలకు, చంద్రాపూర్‌కు 17:40 గంటలకు, సేవగ్రామ్‌కు రాత్రి 19:13 గంటలకు, నాగ్‌పూర్‌కు 20:20 గంటలకు చేరుకోనున్నది.

● అక్టోబరు 23 నుంచి వారాంతపు ప్రత్యేక రైళ్లు..

ప్రయాణికుల సౌకర్యార్థం మధ్య రైల్వే జోన్ పూణె డివిజన్ అధికారులు వారాంతపు ప్రత్యేక రైళ్లు(పూణె నుంచి కరీంనగర్ వరకు) నడపనున్నారు. ఈ ప్రత్యేక రైళ్లు వచ్చే నెల 23వ తేదీ నుంచి పూణె రైల్వే స్టేషన్‌నుంచి ప్రారం భం అవుతాయి. ఈ ప్రత్యేక రైళ్లు ఎగువ మార్గంలో 4 ట్రిప్‌లు, దిగువ మార్గంలో 4ట్రిప్‌లు నడుస్తాయి. రైలు సంఖ్య 01451 పూణె నుంచి కరీంనగర్ వారంతపు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు దిగువ మార్గంలో అక్టోబర్ 21, 28, నవంబరు 4, 11 తేదీల్లో సోమవారం రాత్రి 10:45 నిమిషాలకు పూణె రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరి బుధవారం అక్టోబరు 23, 30 నవంబరు 6, 13 తేదీల్లో తెల్లవారు జా మున 2:00 గంటలకు కరీంనగర్ రైల్వేస్టేషన్ చేరుకుంటుంది. ఈ రైలు ప్రయాణ సమయం 27గంటల 15 నిమిషాలు, వీటిని 4 ట్రిప్పులు నడపనున్నారు. రైలు సంఖ్య 01452 కరీంనగర్ నుంచి పూణె వారాంతపు ప్రత్యేక ఎక్స్ ప్రెస్ రైలు ఎగువ మార్గంలో అక్టోబర్ 23, 30 నవంబర్ 6, 13వ తేదీల్లో బుధవారం ఉదయం కరీంనగర్ రైల్వే స్టేషన్ నుంచి 6 గంటలకు బయలుదేరి మరుసటిరోజు గురువారం ఉదయం 9:45 గంటలకు అక్టోబరు 24, 31 నవంబరు 7, 14 తేదీల్లో పూణె రైల్వే స్టేషన్ చేరుకుం టుంది. ఈ రైలు ప్రయాణ సమయం 29గంటల 45 నిమిషాలు. అలాగే ఉమ్మడి ఆదిలాబాదు జిల్లాలోని మంచిర్యాల, సిర్పూర్ కాగజ్‌నగర్ ప్రజలకు ఈ రైలుద్వారా ఉదయం ఆదిలాబాదు వెళ్లడానికి ఎంతో ఉపయో గంగా ఉంటుంది. కరీంనగర్-పూణె-కరీంనగర్ ప్రత్యేక వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైలు వలన ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి ఆదిలాబాదు జిల్లా కేంద్రాలు అనుసంధానం కానున్నాయి. ఈ రైలు పెద్దపల్లి జంక్షన్, బల్లార్ష జంక్షన్, మాజ్రీ కాదన్, ఆదిలాబాదు, ముద్ఖేడ్, నాందేడ్, పూర్ణా, పర్భని, ఔరం గాబాద్, మన్మాడ్, అహ్మద్‌నగర్, దౌండ్ మీదుగా నడవనున్నది. ప్రస్తుతం ఉమ్మడి ఆదిలాబాదు జిల్లాలోని మంచిర్యాల, సిర్పూర్ కాగజ్‌నగర్ ప్రజలకు ఆదిలాబాదు వెళ్లడానికి రోడ్డు మార్గం తప్ప రైలు సౌకర్యం అందుబాటులో లేవు. ఈ రైలు అందుబాటులోకి వచ్చిన తరువాత చాలామంది దీనిద్వారా ఆదిలాబాదు ప్రయాణించే వీలుంటుంది. అలాగే ఈ రైలు ఐటీ పరంగా ఎంతో అభివృద్ధి చెందిన పూణె నగరాన్ని ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాదు జిల్లాల ప్రజల్ని అనుసంధానం చేయనున్నది. అలాగే ఈ పూణె వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైలు ద్వారా మహారాష్ట్రలోని ప్రముఖ దేవాలయాలు సందర్శించడానికి వీలుగా ఉంటుంది, చంద్రపూర్ (చాందా) మహంకాళి ఆలయం, కిన్వ ట్ రైల్వేస్టేషన్‌కి దగ్గర్లో ఉన్న మహూర్ శక్తిపీఠం (రేణుకాఎల్లమ్మ) ఆలయం, నాందేడ్‌లోని సిక్కుల పవిత్ర గురుద్వారా, ఔరంగాబాద్ (ఛత్రపతి శంబాజీనగర్)లోని అజంతా, ఎల్లోరా గుహలతో పాటు ప్రముఖ గృశ్నేశ్వర్ జ్యోతిర్లింగం, కోపర్‌గావ్ రైల్వేస్టేషన్ దగ్గర్లోని శిరిడీ సాయిబాబా దేవాలయంతో పాటు పూణెలోని వినాయకుని ఆలయాలు సందర్శించుకునే అవకాశాలున్నాయి. కరీంనగర్ నుంచి పూణె 01452 వారాంతపు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు అక్టోబరు 23, 30 నవంబరు 6, 13వ తేదీల్లో బుధవారం ఉదయం పెద్దపల్లి జంక్షన్ 6:45 గంటలకు వస్తుంది. ఈ రైళ్లకు పెద్దపల్లి జంక్షన్, రామగుండం, మంచిర్యాల, సిర్పూర్‌కాగజ్‌నగర్, ఆదిలాబాదు రైల్వేస్టేషన్‌లలో స్టాప్ సదుపాయం కల్పించారు. పూణెనుంచి వచ్చే టప్పుడు ఈ రైలు పెద్దపల్లి జంక్షన్‌కి బుధవారం రాత్రి 12:08 గంటలకు వస్తుంది. ఈ రైళ్లను సద్వినియోగం చేసుకోవాలని రైల్వే అధికారులు కోరుతున్నారు.

● చార్జీల వివరాలు..

సికింద్రాబాద్ నుంచి నాగ్‌పూర్‌కు నడనున్న వందేభారత్ రైలు నంబర్ 20102లో కోచ్‌లను బట్టి చార్జీలను వసూలు చేయనున్నారు. సికింద్రాబాద్ నుంచి నాగ్‌పూర్ వరకు చైర్‌కార్‌లో రూ.925 (ఆహా రం కలిపి), రూ. 885(ఆహారం లేకుండా), ఎగ్జి క్యూటివ్ క్లాస్‌లో రూ.1510 (ఆహారంతో కలిపి), రూ. 1305 (ఆహారం లేకుండా) చార్జీలు తీసుకోనున్నారు. సికింద్రాబాద్ నుంచి రామగుండంకు చైర్ కార్‌లో రూ.670 (ఆహారం లేకుండా), రూ.865 (ఆహారంతో కలిపి), ఎగ్జిక్యూటివ్‌క్లాస్‌లో రూ. 1510 (ఆహారంతో కలిపి), రూ.1305 (ఆహారం లేకుండా) చార్జీలు తీసుకోనున్నారు. ఈ రైలులు ఎటువంటి రాయితీలు వర్తించవు. వికలాంగుల కోటా, సీనియర్ సిటిజన్‌ల, ఇతరత్రా ఎవరికి కూడా రాయితీలు ఉండవని రైల్వే అధికారులు పేర్కొన్నారు.

ప్రాణం తీసిన అతివేగం

- ద్విచక్ర వాహనాలను ఢీకొన్న ప్రైవేట్ బస్సు
- బైక్‌ని 150 మీటర్ల దూరం ఈడ్చుకెళ్లడంతో.. తాత, మనువరాలు దుర్మరణం
- మనవడి పరిస్థితి విషమం
- అల్లీపూర్, ధర్మపురిలో తీవ్ర విషాదం


నారవేణి శ్రీనిధి (ఫైల్)


బైండ్ల లచ్చన్న (ఫైల్)

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 15 : ఓ ప్రైవేటు బస్సు అతివేగం ఇద్దరి ప్రాణాలను బలిగొంది. ఉత్సాహంగా గణేష్ నిమజ్జన వేడుకలు చూసేందుకు వెళ్తూ తాత, మనుమరాలు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. జగిత్యాలరూరల్ మండలంలోని పొలాసలో ఆదివారం ఘోర రోడ్డుప్రమాదం చోటు చేసుకుంది. జగిత్యాల-ధర్మపురి జాతీయ రహదారిపై జగిత్యాలరూరల్ మండలంలోని పొలాస స్టేజీవద్ద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఆగిఉన్న ఆర్టీసీ బస్సు ను ఓవర్‌టేక్ చేసే క్రమంలో అతివేగంగా రెండు ద్విచక్ర వా హనాలను ఢీకొట్టింది. ఈఘటనలో రాయికల్ మండ లం అల్లీపూర్‌కు చెందిన బైండ్ల లచ్చన్న (52) ధర్మపురి పట్టణానికి చెందిన నారవేణి శ్రీనిధి (09) అక్కడికక్కడే మృతి చెందారు. జగిత్యాలరూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామా నికి చెందిన బైండ్ల లచ్చన్న కూతురు మమత ధర్మపురిలో ఉంటున్నారు. అల్లీపూర్‌లో జరుగుతున్న గణేష్ నిమజ్జన వేడుకలను పిల్లలకు చూపించాలని కూతురి కోరిక మేరకు ధర్మపురి నుంచి అల్లీపూర్‌కు మనుమడు, మనుమరాలును తీసుకొని ద్విచక్రవాహనంపై బయల్దేరారు. మార్గమధ్యలోని జగిత్యాలరూరల్ మండలం పొలాస వద్దకు చేరుకోగానే వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని కొండగట్టు నుంచి ధర్మపురి వైపు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు నంబర్ (టీఎస్ 21 యూడీ 9955) అతి వేగంగా ఓవర్‌టేక్ చేసి బలంగా ఢీకొట్టింది. దీంతో వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని బస్సు 150మీటర్ల మేర ఈడ్చుకెళ్లడంతో శ్రీనిధి, లచ్చన్న అక్కడి కక్కడే మృతి చెందారు. మృతదేహాలు నుజ్జునుజ్జై రహదారిపై చెల్లాచెరుదుగా పడిఉన్నాయి. మల్లి కార్జున్‌కు తీవ్ర గాయాల వడంతో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇదే ఘటనలో జగిత్యాలరూరల్ మండలం పొలాసకు చెందిన బూర్ల రాజన్న, బద్దెనపల్లి నర్సయ్యలు ప్రయాణిస్తున్న స్కూటీని సైతం బస్సు ఢీకొట్టడంతో తీవ్రగాయాలై జగిత్యాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ రఘుచందర్, రూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్సై సధాకర్ పరిశీలించారు. నారవేణి మమత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు.

అతివేగం.. నిర్లక్ష్యం

జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస స్టేజీ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదానికి అతి వేగమే కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొండగట్టు వైపు నుంచి ధర్మపురి వైపు అతివేగంగా వస్తున్న ప్రైవేట్ బస్సు పొలాస స్టేజీ వద్ద ఆగిఉన్న ఆర్టీసీ బస్సును ఓవర్ టేక్ చేసే క్రమంలో ధర్మపురి నుంచి జగిత్యాల వైపు వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టడంతో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారని వారు సంఘటన స్థలంలో చర్చించు కున్నారు. కొంత తక్కువ వేగంగా ఉంటే ప్రమాద తీవ్రత తగ్గి ఉండేదని స్థానికులు భావిస్తున్నారు. కుటుంబ సభ్యులు సంఘటన స్థలంలో రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృతితో రాయికల్ మండలం అల్లీపూర్, ధర్మపురిలో తీవ్రవిషాదం చోటుచేసుకుంది.

శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



జగిత్యాల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాం సాగర్ ప్రాజెక్టులోకి ఆదివారం ఇన్‌ఫ్లో కొనసాగింది. ఎస్సారెస్పీలోకి 25,840 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు కలిపి ప్రాజెక్టు నుంచి 25,840 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

క్రైం కార్నర్

వ్యక్తి రిమాండ్

హుజూరాబాద్, సెప్టెంబరు 15: హుజూరాబాద్‌లో ఓ యూట్యూబ్ ఛానల్‌కు చెందిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన పి సమ్మయ్య అనే వ్యక్తి భూపాల్‌పల్లిలో నివాసం ఉంటున్నాడు. జూలై నెలలో హుజూరాబాద్‌కు చెందిన ఓ వ్యాపారిని టి సంపత్ అనే వ్యక్తి డబ్బులు అడిగినట్లు యూట్యూబ్ ఛానల్ వ్యక్తి సమ్మయ్య ఆడియో సోషల్ మీడియాలో వైరల్ చేశాడు. దీంతో సదరు సంపత్ తనకు సంబంధం లేదని, తాను ఎవరిని డబ్బులు అడగలేదని హుజూరాబాద్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశారు. యూట్యూబ్ ఛానల్‌కు చెందిన సమ్మయ్య అనే వ్యక్తి వేరే వ్యక్తి జగన్‌తో కావా లనే చేశాడని తేలింది. సమ్మయ్యను హుజూరాబాద్ డిపో క్రాస్ వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి నట్లు తెలిపారు. గతంలో సమ్మయ్యపై భూపాల్‌పల్లిలో రౌడీషీట్‌తో పాటు ఐదు కేసులు ఉన్నట్లు టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

జ్వరంతో మహిళ మృతి


లక్ష్మి(ఫైల్)

ముత్తారం, సెప్టెంబరు 15 : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని పోతారం గ్రామంలో గుజ్జుల లక్ష్మి(52) జ్వరంతో మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... లక్ష్మి నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. ఆమెను కొడుకు రాజ్‌కుమార్ ఆదివారం 108 అంబులెన్స్‌లో పెద్దపల్లి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందింది. లక్ష్మి భర్త నాలుగేళ్ల క్రితం మృతి చెందగా, తన కొడుకుతో కలిసి పోతారం గ్రామం లో కూలి పని చేసుకుంటూ జీవిస్తోంది.

పోలీసుల పేరు చెప్పి బైక్‌తో ఉడాయింపు

కరీంనగర్‌లో సినీ ఫక్కీలో చోరీ

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 15: పోలీసుల పేరు చెప్పి శనివారం రాత్రి యువకుడి వద్ద ద్విచక్రవాహనం తీసుకుని ఓ దొంగ ఉడాయిం చాడు. బాధితుడు, పోలీసులు తెలిపిన వివ రాల ప్రకారం కరీంనగర్ తిలక్‌రోడ్‌కు చెందిన బొజ్జ శివ బీటెక్ పూర్తి చేసి ఇంటివద్దనే ఉంటు న్నాడు. బొజ్జ శివ శనివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో తన రాయల్ ఎన్‌ఫీల్డ్(టీఎస్ 02 ఇఎక్స్ 7852) బైక్‌పై పని కోసం బయటకు వచ్చాడు. శివ శాస్త్రీరోడ్ ఒక మెడికల్ షాపు వద్దకు వచ్చేసరికి ట్రాఫిక్ పోలీసు వేషధారణ లో వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి తాను ట్రాఫిక్ పోలీసునంటూ పరిచయం చేసుకున్నాడు. మా ఎస్ఐని తీసుకొని వస్తానని చెప్పి రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ తీసుకెళ్లాడు. ఆ వ్యక్తి ఎంతకీ రాకపోయేసరికి తాను మోసపోయానని శివ గ్రహించాడు. బైక్ కోసం రాత్రంతా వెతికిన శివ ఆదివారం ఒకటో టౌణా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. శాస్త్రీరోడ్‌లోని సీసీ కెమెరాలను క్రైంపార్టీ పోలీసులు పరిశీలించి, నిందితుడి కోసం గాలిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గన్నేరువరం, సెప్టెంబరు 15 : మండలంలోని గుండ్లపల్లి స్టేజీ రాజీవ్ రహదారిపై వెళుతున్న బైకును వెనక నుంచి కారు ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాల య్యాయి. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం కరీంనగర్ నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న టీఎస్ 36జె1895 బైకును వెనక నుంచి టీఎస్ 28జె8868 కారు ఢీకొట్టింది. దీంతో బైక్ మీద ఉన్న ఇద్దరు ఎగిరిపడడంతో ఒకరికి కాలు విరగగా, మరొకరికి భుజానికి గాయం అయింది. స్థానికులు టోల్‌గేట్ అంబులెన్స్‌లో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తులు హుజూరాబాద్ మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన ఉమాపతిరెడ్డి, సుభాష్ రెడ్డిగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.


మిడ్ మానేరు ప్రాజెక్ట్

నిండుకుండలా మిడ్ మానేరు

బోయినపల్లి, సెప్టెంబరు 14: శ్రీరాజరాజేశ్వర జలాశయం (మిడ్ మానేరు) నిండు కుండలా మారింది. మేడిగడ్డ ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతలు లేకపోవడంతో ఈ ఏడాది మిడ్ మానేరు పూర్తిస్థాయిలో నిండుతుందా? అనే సందేహం తలెత్తింది. అయితే ఎల్లంపల్లి, ఎస్సారెస్పీ నుంచి వరద నీరు వచ్చి చేరడంతో జలకళను సంతరించుకుంది. ఈ ఏడాది జూన్ 1 నుంచి ఆదివారం ఉదయం వరకు మిడ్ మానేరులోకి 48.859 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా ఇందులో శ్రీపాద ఎల్లంపల్లి ఎత్తిపోతల ద్వారా 23.978 టీఎంసీలు, ఎస్సారెస్పీ నుంచి 12.376, ప్రాజెక్టు ఎగువ భాగాన కురిసిన వర్షాలతో మానేరు, ములవాగు ద్వారా 12505 టీఎంసీల వరద నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరింది. మిడ్ మానేరు నుంచి ఎల్ఎండీ ప్రాజెక్టుకు 10.127 టీఎంసీలు, ప్యాకేజీ 10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 17.534 టీఎంసీలు కుడి కాలువకు 0.079 మిషన్ భగీరథక, నీటి ఆవిరి కింద 0.813 టీఎంసీలు తరలివెళ్లాయి. దీంతో మిడ్ మానేరుపై ఆధారపడిన ప్రాజెక్టులకు నీటి కష్టాలు తప్పడంతో ప్రాజెక్టుపై ఆధారపడిన పంట భూములకు వానాకాలం, యాసంగి సాగుకు ఢోకా లేకుండా పోయింది. మిడ్ మానేరు పూర్తి స్థాయి నీటి మట్టం 318. మీటర్లకు ప్రస్తుతం 317.47కు చేరుకుంది. నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు 26.19 టీఎంసీలకు చేరుకుంది.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ

పట్టపగలే ఇంట్లోకి దూరి దొంగతనం


బాధితురాలు సబ్బని రుక్కుమ్ బాయితో మాట్లాడుతున్న పోలీసులు

తంగళ్లపల్లి, సెప్టెంబరు 15 : తంగళ్లపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఆదివారం ఓ దుండగుడు పట్టపగలే ఇంట్లోకి దూరి వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసు ఎత్తుకెళ్లాడు. బాధితురాలి వివరాల ప్రకారం.. తంగళ్లపల్లికి చెందిన సబ్బని రుక్కుమ్‌బాయి అనే వృద్ధురాలు ఆదివారం ఉదయం ఇంట్లో వంట చేసుకుంటోంది. దుండగుడు ఇంట్లోకి దూరి ఒంటిపై ఉన్న బంగారు గొలుసు లాక్కొని పరారయ్యాడు. వృద్ధురాలు అరుస్తూ ఇంటి బయటకు రాగా పక్కనే వినాయక మండపం వద్ద ఉన్న యువకులు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే దొంగ ద్విచక్ర వాహనంపై పారిపోయినట్లు స్థానికులు తెలిపారు. సుమారు రెండున్నర తులాల బంగారు గొలుసు ఎత్తుకెళ్లి నట్లు బాధితురాలు తెలిపింది. రుక్కుమ్‌బాయి భర్త, కుమారుడు మృతి చెందగా ఒక్కతే ఉంటోంది. ఇది గమనించి పథకం ప్రకారం ఇంట్లోకి దూరి గొలుసు ఎత్తుకెళ్లినట్లు స్థానికులు భావిస్తున్నారు. ఎస్సై సుధాకర్ బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు. పట్టపగలు చోరీ జరగడంతో పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, దొంగ కోసం గాలిస్తున్నామని తెలిపారు.

వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 15: వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదివారం పెద్దపల్లిలో చోటు చేసుకుంది. శాంతినగర్‌కు చెందిన మోహన్‌రెడ్డి(58) ఉదయం వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్తుండగా గోదావరిఖని నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న కోళ్లవ్యాన్ ఢీకొట్టింది. మోహన్‌రెడ్డికి తీవ్రగాయాలు కాగా, పెద్దపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందాడు. భార్య శివపార్వతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. యాక్సిడెంటు చేసిన డ్రైవర్ గోలి రతన్ పోలీసులకు లొంగిపోయాడు.

పురుగుల మందు తాగి..

జూలపల్లి, సెప్టెంబరు 15 : మండల కేంద్రానికి చెందిన కల్లెం తిరుపతిరెడ్డి(45) జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆదివారం మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతిరెడ్డికి పిల్లలు లేరు. రెండేళ్ల క్రితం భార్య అనారోగ్యంతో మృతిచెందింది. అప్పటి నుంచి ఆయన మానసికంగా కృంగిపోయి పిచ్చిగా ప్రవర్తించేవాడని, ఈక్రమంలో మృతుడి తండ్రి రాజిరెడ్డికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో తల్లి కరీంనగర్ ఆసు పత్రికి తీసుకపోయి వైద్యం కోసం అక్కడనే ఉంటున్నారు. దీంతో జూలపల్లిలో ఇంటివద్ద ఒంటరిగా ఉన్న తిరుపతిరెడ్డి జీవితంపై విరక్తిచెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసు న్నాడు. మృతుడి తల్లి నర్సమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సమస్యల వలయంలో గుండ్లపల్లి గురుకుల పాఠశాల



గుండ్లపల్లిలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల

గన్నేరువరం, సెప్టెంబరు 15: మండలంలోని గుండ్లపల్లి స్టేజీ వద్ద నిర్వహిస్తున్న మహాత్మా జ్యోతి బాపూలే బాలికల గురుకుల పాఠశాలలో అసౌకర్యాలు వెక్కిరిస్తున్నాయి. పాఠశాలలకు వరుస సెలవులు ఇవ్వడంతో విద్యార్థినులను ఇంటికి తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులు ఆదివారం హాస్టల్‌కు వచ్చారు. హాస్టల్లో విద్యార్థినులు పడుతున్న అవస్థలను పరిశీలించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ హాస్టల్ ఆవరణలో మురుగు నీరు నిల్వ ఉండడంతో దుర్గంధం వెదజల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బాత్ రూములకు డోర్లు కూడా ఊడిపోయి కనిపించడంతో హాస్టల్ నిర్వహణపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్‌తో సహా ఏ ఒక్క టీచరు హాస్టల్‌లో లేరన్నారు. ప్రిన్సిపాల్, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పాఠశాల గేటు ఎదుట నిరసన వ్యక్తం చేశారు.

హాస్టల్‌ను మానకొండూరుకు మారుస్తాం

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

గుండ్లపల్లి స్టేజీ వద్ద కొనసాగుతున్న మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలను ఇటీవల స్వయంగా తనిఖీ చేశాను. హాస్టల్‌లోని విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నాను. హాస్టల్‌లో ప్రధానంగా మురుగు నీటి సమస్య ఉందని గుర్తించి ప్రిన్సిపాల్‌ను వివరణ కోరాను. మురుగునీరు బయటకు వెళ్లే మార్గం లేదని, హాస్టల్ భవనం అసౌకర్యంగా ఉందని తెలిపారు. బిల్డింగ్ యజమానితో ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని తెలపారు. దీంతో హాస్టల్‌ను మానకొండూరుకు తరలించేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లాను. త్వరలోనే మానకొండూరులోని జూనియర్ కాలేజీకి హాస్టల్‌ను మారుస్తాము.

ధర్మగుండంలో గణపయ్య నిమజ్జనం


ధర్మగుండంలో వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న అర్చకులు, సిబ్బంది

వేములవాడ, సెప్టెంబరు 15 : గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు అందుకున్న ఆది దేవుడు విఘ్నేశ్వరుడి నిమజ్జనోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల కోసం రాజన్న ఆలయ ఆవరణలోని నాగిరెడ్డి మండపంలో ప్రతిష్ఠించిన విఘ్నేశ్వరుడికి ఆలయ అర్చకులు ప్రతీరోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేకపూజలు చేశారు. చివరి రోజైన ఆదివారం ఉదయం ఆలయ అర్చకులు, వేద పండితులు హవనము నిర్వహించి పూర్ణాహుతి, రాత్రి ప్రత్యేక పూజల తదుపరి పట్టణ వీధుల మీదుగా గణేశుడి శోభాయాత్ర కన్నుల పండు వగా నిర్వహించారు. ధర్మగుండంలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వినోద్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, ఆలయ అధికారులు, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడికి రాజన్న ప్రసాదం



పీసీసీ అధ్యక్షుడిని సత్కరిస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడ, సెప్టెంబరు 15: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌కు వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వేములవాడ రాజరాజేశ్వర స్వామి ప్రసాదాన్ని అందజేశారు. హైదరాబాద్ లోని గాంధీ భవన్‌లో ఆదివారం బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పీసీసీ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆది శ్రీనివాస్ మహేష్ కుమార్ గౌడ్‌ను స్వామివారి శేష వస్త్రంతో సన్మానించి ప్రసాదం అందజేశారు.

సందడిగా నిమజ్జనోత్సవం



నిమజ్జనోత్సవంలో విద్యార్థులు, మహిళల నృత్యం

సిరిసిల్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనోత్సవాల సందడి జిల్లా కేంద్రంలో మొదలైంది. సెలస్టియల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆదివారం ఎంతో భక్తి శ్రద్ధలతో గణేష్ నిమజ్జనాన్ని నిర్వహించారు. రకరకాల పిండి వంటలతో వినాయకునికి ప్రత్యేక పూజలు చేశారు. అశోక్‌నగర్ నుంచి చేనేత చౌక్, అంబేద్కర్ చౌరస్తా, గాంధీచౌక్ నుంచి మానేరు తీరం వరకు శోభాయాత్ర నిర్వహించారు. విద్యార్థులు నృత్యాలు కోలాట సందడిలో మానేరు వాగులో వినాయకున్ని నిమజ్జనం చేశారు. పాఠశాల కరస్పాడెంట్ బుర్ర రాధాకృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ మచ్చ ఇందిర, ఉపాధ్యాయులు రఘుపతి, సంతోష్, రాములు, వెంకటయ్య, రూప, వీణ, రజని, ప్రియ, సౌజన్య, నీలిమ దేవి, రోహిణి, నవీన, భాను, పద్మ, మనీషా, రజని పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



మెడల్స్‌తో విద్యార్థులు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 15: ఆల్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీలలో మండలకేంద్రంలోని వాణీనికేతన్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కరీంనగర్‌లోని అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన పోటీలలో చొప్పరి హర్షిత గోల్డ్ మెడల్, సుదోగని పెద్దోళ్ల గణేష్ సిల్వర్ మెడల్, చొప్పరి విఘ్నేశ్వర్ కాంస్య పతకాలు అందుకున్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ తూముకుంట శ్రీనిధి, కరాటే మాస్టర్ శరత్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

రోడ్డుపై గుంతలు పూడ్చి వేత

ఇల్లంతకుంట, సెప్టెంబరు 15: మండలంలోని ముస్కానిపేట, కేసన్నపల్లె గ్రామాల మధ్య రోడ్డుపై గుంతలు పడి ప్రజలు ఇబ్బంది పడుతుండగా కాంగ్రెస్ నాయకులు ఆదివారం గుంతలను పూడ్చివేయించారు. రోడ్డుపై గుంతలు పడినట్లు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు గుంతలలో మొరం పోసి పూడ్చివేయించారు. కాంగ్రెస్ నాయకులకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మానకొండూర్ నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, ఏఎమ్‌సీ డైరెక్టర్ తాట్ల వీరేశం, నాయకులు బద్దం హన్మంతరెడ్డి, గుమ్మటాల నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ముత్యాల పోచమ్మ ఆలయ వార్షికోత్సవాలు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 15: మండలంలోని అనంతగిరి గ్రామ ముత్యాల పోచమ్మ వార్షికోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం అవుతాయని ఈవో మారుతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజులపాటు జరిగే ఉత్సవాలలో మహారుద్ర, మహాచండీ సహిత మహాశక్తి యాగాలు జరుగుతాయని, ప్రతీ రోజు సమయానుకూలంగా ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులు కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

అన్నపూర్ణ రిజర్వాయర్‌కు కొనసాగుతున్న ఎత్తిపోతలు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 15: ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామ సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు నీటి ఎత్తిపోలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.13 టీఎంసీలకు చేరుకున్నాయి. మధ్యమానేరు ద్వారా వచ్చిన 6400 క్యూసెక్కుల నీటిని రెండు పంపుల ద్వారా ఎత్తిపోస్తుండగా, ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 3300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ

గంభీరావుపేట, సెప్టెంబరు 15: గంభీరావుపేట మండల ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గన్నె నాగరాజు, ఉపాధ్యక్షులుగా ఉపేందర్, అంబటి ఎల్లయ్య, గొర్రె కిషోర్, నీరటి ఎల్లం, ప్రధాన కార్యదర్శులుగా జక్కుల నవీన్, కరిక బాబు, తంగళపల్లి ప్రభాకర్, ప్రచార కార్యదర్శులుగా బండ విష్ణు, దోసల శంకర్, తోడేటి సుదర్శన్, రత్నాకర్, కార్యవర్గ సభ్యులుగా సత్యం, స్వామి, నారాయణ, దేవరాజు, రాజ్‌కుమార్, భూషనం, రవి, లింగం, నర్సింలు, భాస్కర్, విక్రమ్‌గాంధీ, రాజు, వినోద్, ఆదిత్య, మహేష్, స్వామి, సలహాదారులుగా బార ధన్‌రాజు, భూదయ్య, సురేందర్ ఎన్నికయ్యారు. జిల్లా కో కన్వీనర్ జక్కుల యాదగిరి, జిల్లా సభ్యుడు బండ రాజు, జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.

పత్తి పంట ధ్వంసం

కోనరావుపేట, సెప్టెంబరు 15: కోనరావుపేట మండలం మామిడిపల్లి శివారులోని పత్తి పంటను అడవి పందులు ధ్వంసం చేశాయి. గ్రామానికి చెందిన మోకిటే కృష్ణస్వామి అనే రైతుకు చెందిన రెండు ఎకరాల పత్తి పంటను ధ్వంసం చేశాయి. ధ్వంసం చేసిన పత్తి పంటకు అధికారులు నష్టపరిహారం అందించాలని బాధిత రైతు కోరాడు.

ఏకదంతుడికి విశేష పూజలు



వేములవాడలో వినాయకుడిని దర్శించుకుంటున్న ఆది శ్రీనివాస్



ఎల్లారెడ్డిపేటలో దీపాలంకరణ



రుద్రంగిలో కుంకుమ పూజలో మహిళలు

సిరిసిల్ల టౌన్ సెప్టెంబరు 15 : గణేష్ నవరాత్రులలో భాగంగా పట్టణంలోని వివిధ వార్డుల్లో మండపాల నిర్వాహకులు వినాయకుడికి విశేష పూజలు చేశారు. కుంకుమ పూజలు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక విద్యానగర్ శ్రీ అభయాంజనేయ వెల్ఫేర్ సొసైటీ గణేష్ మండపం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని మునిసిపల్ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి ప్రారంభించారు. ముందుగా గణేష్ మండపంలో చైర్‌పర్సన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్ పట్టణ అధ్యక్షులు చక్రపాణి, పట్టణ సిఐ కృష్ణ, సొసైటీ అధ్యక్షుడు బొల్లి రామ్మోహన్ ప్రధాన కార్యదర్శి ఎల్లారెడ్డి, కోశాధికారి చంద్రశేఖర్, సాంస్కృతిక కార్యదర్శి బుస రాజేందర్, సభ్యులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు నారాయణపూర్, రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, దుమాల, వెంకటాపూర్, గుండారం, తిమ్మాపూర్, తదితర గ్రామాల్లోని వినాయక మండపాల వద్ద ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. యువజన, కుల సంఘాల ఆధ్వర్యంలో కుంకుమ పూజలను జరిపించారు. ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, తాజా, మాజీ ప్రజాప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించి వినాయకుడిని దర్శించుకున్నారు. తిమ్మాపూర్‌లోని ఆదర్శ యువజన సంఘం సభ్యులు ముగ్గుల పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆయా యువజన, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ఆదివారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు మండపం ఎదుట గణపయ్య ఆకృతిలో దీపాలంకరణ చేశారు. భక్తిశ్రద్ధలతో స్వామిని దర్శించుకున్నారు. స్థానిక కిషన్‌దాస్‌పేటలోని భక్తాంజనేయస్వామి ఆలయంలో వినాయకుడికి 21 రకాల నైవేద్యాలను సమర్పించారు. సంఘం అధ్యక్షుడు రాపల్లి దేవాంతం, ప్రధాన కార్యదర్శి వనం రమేశ్, ఉపాధ్యక్షుడు శ్రీరాం సుదర్శన్ పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని వివిధ గ్రామాలలో వినాయక మండపాల వద్ద ప్రత్యేక పూజలు, అన్నదానాలు నిర్వహించారు.

వేములవాడ వేములవాడ పట్టణంలోని భగవంతరావు నగర్‌లో గణేష్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో మండపంలోని గణనాథున్ని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదివారం దర్శించుకున్నారు. అనంతరం మంటప నిర్వాహకులు ఆది శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు.

చందుర్తి: చందుర్తి మండలం మల్యాల వేంకటేశ్వర స్వామి దేవస్థానం సమీపంలో కాలనీవాసులు వినాయక మండపంలో ఆదివారం కుంకుమ పూజలను నిర్వహించారు.

రుద్రంగి: మండల కేంద్రంలో ఆదివారం గణేష్ మండపాల వద్ద కుంకుమ పూజలు, మహా అన్నదానం, ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలోని ఇందిరా చౌక్ చౌరస్తాలో సర్వజన గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో, హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తాలోని ఎస్ఆర్ఆర్ యూత్ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు చేశారు.



చందుర్తిలో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు



సిరిసిల్లలో అన్నదానం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కళ



ఇల్లంతకుంటలో పూజలు నిర్వహిస్తున్న నిర్వాహకులు

గణేష్ నిమజ్జనోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



పరిశీలిస్తున్న ప్రతాప రామకృష్ణ

వేములవాడ, సెప్టెంబరు 15: గణేష్ నిమజ్జనోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ కోరారు. వేములవాడ గుడి చెరువు కట్టపై మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేపట్టిన నిమజ్జనోత్సవం ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ వేములవాడ పట్టణంతోపాటు విలీన గ్రామాల్లో కలిపి దాదాపుగా 300 పైగా గణేష్ మండపాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భారీ గణనాథులను ఊరేగింపుగా తీసుకొచ్చేందుకు వీలుగా పట్టణంలో ఏర్పాట్లు చేయాలని, ప్రధాన కూడళ్లలో లైటింగ్ ఏర్పాటు చేయడంతోపాటు రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చాలని కోరారు. పారిశుధ్య నిర్వహణ, మంచినీటి సరఫరాతోపాటు నిమజ్జనోత్సవం చూడడానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు ఎదురు కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. గణేష్ నిమజ్జనోత్సవానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని, మున్సిపాలిటీలు గ్రామపంచాయతీలలో నిధుల కొరత కారణంగా ఏర్పాటు సక్రమంగా చేయడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ రేగుల సంతోష్ బాబు, నాయకులు పిన్నింటి హనుమాండ్లు, గుడిసె మనోజ్, నామాల శేఖర్, సగ్గు రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీనివాసరావు, కిషన్



మాట్లాడుతున్న అధ్యక్షుడు శ్రీనివాసరావు

సిరిసిల్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రోగెసివ్ రికగ్నైజ్‌డ్ టీచర్స్ యూనియన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండు లక్ష్మణ్ సమక్షంలో నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. మరోసారి పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడిగా గన్నమనేని శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా ఎడ్ల కిషన్ ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షులుగా మాడిశెట్టి మహేష్, జక్కని నవీన్, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా అవునూరి సరోజ, మహిళా అధ్యక్షురాలిగా కైరి పద్మ, ఉపాధ్యాక్షులుగా షేక్ బాబు, ఎర్ర ప్రవీణ్‌కుమార్, ఉమ్మెత్తుల లవన్ కుమార్, పోతుగంటి శ్రీనివాస్, పోతిక అనంద్ కుమార్, కార్యదర్శులుగా నల్ల పర్శరాం, తేల్లు పూర్ణచందర్, అరకాల బాల్‌రెడ్డి, మాచర్ల కిషోర్ గౌడ్, వేముల ప్రతాప్, మహిళా కార్యదర్శిగా తేల్ల వకుల ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండు లక్ష్మణ్, నూతన అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ త్వరలో ఉమ్మడి సర్వీస్‌రూల్స్ సాధిస్తామన్నారు. పదోన్నతులు, బదిలీలకు సంబంధించి పీఆర్టీయూ కృషి చేసిందని, అదే విధంగా ఈ నెలలో రెండు డీఏలు సాధిస్తామని తెలిపారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి



సభ్యత్వ నమోదులో పాల్గొన్న నాయకులు

ముస్తాబాద్/చందుర్తి, సెప్టెంబరు 15 : బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జ్ కొక్కుల దేవేందర్ యాదవ్ అన్నారు. మండలంలోని మల్యాల, ఎనగల్, నర్సింగాపూర్ గ్రామాల్లో ఆదివారం సభ్యత్వ నమోదు నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ విధానాలు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల్లోకి వెళ్లాయని, చాలా మంది స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారని అన్నారు. మరోసారి ప్రపంచంలోనే అత్యధికంగా కార్యకర్తలు ఉన్న పార్టీగా బీజేపీ రికార్డు నెలకొల్పడం ఖాయమన్నారు. ప్రతీ వ్యక్తి జాతీయ భావనతో భారతీయ జనతా పార్టీ సభ్యత్వం తీసుకోవాలన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అల్లాడి రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు సిరికొండ శ్రీనివాస్, మండల అధ్యక్షులు పొంచెట్టి రాకేష్, మండల ప్రధాన కార్యదర్శి చింతకుంట గంగాధర్, నాయకులు చిర్రం తిరుపతి, పేరుక గంగరాజు పాల్గొన్నారు.

దేశం కోసం ధర్మం కోసం పని చేసేది ఒక బీజేపీయేనని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మల్లారపు సంతోష్‌రెడ్డి అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు మెర్గు అంజాగౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీ ద్వారానే దేశ రక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ మల్లారెడ్డి, బాధ నరేశ్, కోల కృష్ణ, శ్రీనివాస్‌రావు, జిల్లెల్ల మల్లేశం, ఎదునూరి గోపి, మీస శంకర్, బాల్‌రెడ్డి, సత్తయ్య, శ్రీకాంత్, మీస స్వామి, కార్తీక్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు తరలిన క్రీడాకారులు



హైదరాబాద్ వెళ్తున్న క్రీడాకారులు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 15 : తెలంగాణ రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఆదివారం సిరిసిల్ల నుంచి జిల్లా క్రీడాకారులు తరలి వెళ్లారు. బాలికలు 27 మంది, బాలురు 9 మంది ఉన్నారు. హైదరాబాద్ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో తెలంగాణ రాష్ట్ర స్థాయి(ఇంటర్ డిస్ట్రిక్)పోటీలకు వెళ్లారు. యోగా అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్, కోచ్ బుర్ర అశోక్, సీనియర్ క్రీడాకారులు కుసుమ కుమారి సందీప్, లావణ్య, సరళదేవి ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

రుద్రంగి, సెప్టెంబరు 15 : రుద్రంగి మండలం ఉమ్మడి మానాల గ్రామంలో 14 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం బీఆర్ఎస్ నాయకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దెగవాత్ తిరుపతి, మాజీ వైస్ ఎంపీపీ పిసరి చిన్న భూమయ్య, రామ్‌దాస్, జూల భూమన్న, రాజేశం, రవి పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ మహారాజ్ నవరాత్రోత్సవాలు



ఉత్సవాలు నిర్వహిస్తున్న గిరిజనులు

వీర్నపల్లి, సెప్టెంబరు 15: మండలంలోని జవహర్‌లాల్ నాయక్ తండా గ్రామంలోని బంగిరెడ్డి తండాలో సంత్ సేవాలాల్ మహారాజ్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా సేవాలాల్ చిత్రపటం ఏర్పాటు చేశారు. తొమ్మిది రోజులపాటు స్థానిక గిరిజనులు మాలధరించి పూజలు చేయనున్నారు. ఆదివారం ఎల్లారెడ్డిపేట మాజీ సర్పంచ్ నేవూరి వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు కొమిరెశెట్టి తిరుపతి దర్శించుకున్నారు.

నృసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి, సెప్టెంబరు 15: ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామి దేవాలయాన్ని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి కుటుంబ సమేతంగా ఆది వారం సందర్శించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం వేదపండితులు, అర్చకులు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ముఖ్య అర్చకులు నంబి నరసింహమూర్తి, అర్చకులు చక్రపాణి కిరణ్ వారిని ఘనంగా ఆశీర్వదించారు.

కౌశిక్‌రెడ్డిని సస్పెండ్ చేయాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ప్రకాష్

సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 15 : హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని సస్పెండ్ చేసిన తరువాత బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ విమర్శలు చేయాలని కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్ ఆవరణలో విలేకరుల సమావేశంలో టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణతో కలిసి మాట్లాడారు. కౌశిక్‌రెడ్డి ముందుగా ఏం చేశారో గ్రహించకుండా, వ్యాఖ్యలను కండించకుండా కేటీఆర్ మద్దతు తెలపడం శోచనీయమన్నారు. ఎమ్మెల్యేలు పార్టీలు మారడం వారి ఇష్ట ప్రకారం జరుగుతుందని, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అదుపులో పెట్టుకోవాలని అన్నారు. గతంలో అధికారంలో ఉన్న సమయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను తీసుకోవడం తప్పు అనిపించలేదా? అని ప్రశ్నించారు. కోర్టు ఇచ్చిన డైరెక్షన్‌ను సీఎం రేవంత్‌రెడ్డి స్వాగతించారన్నారు. బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఇద్దరు ఎమ్మెల్యేల మధ్య ఘర్షణను సంబంధం లేని కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రిపై ఆపాదించడం సరికాదన్నారు. కౌశిక్‌రెడ్డి తీరును కేటీఆర్ సమర్థించడం సిగ్గుచేటన్నారు. ఉద్దేశపూర్వకంగానే రాష్ట్ర ప్రజలను డైవర్షన్ చేయడానికి కౌశిక్‌రెడ్డితో డ్రామాలు చేయిస్తున్నారని, లబ్ధిపొందాలని చూస్తున్నారని ఆరోపించారు. మహిళలపై గౌరవం లేకుండా, తోటి ఎమ్మెల్యేను కించపరుస్తూ రెచ్చగొట్టె చర్యలకు పాల్పడిన కేశిక్‌రెడ్డిని ముందుగా అరెస్టు చేయాలన్నారు. అనంతరం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ప్రమాణస్వీకారానికి కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా, పట్టణ నాయకులు ఆకునూరి బాలరాజు, గడ్డం నర్సయ్య, వైద్య శివప్రసాద్, యెల్లె లక్ష్మినారాయణ, బొప్ప దేవయ్య తరలివెళ్లారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పాదయాత్రలు

గంభీరావుపేట, సెప్టెంబరు 15 : ఎస్సీ వర్గీకరణ తీర్పును వ్యతిరేకిస్తు పాదయాత్రలు చేపట్టనున్నట్టు మాల మహానాడు ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం వెల్లడించారు. గంభీరావుపేటలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రానున్న రోజుల్లో గ్రామాల్లో మండల కమిటీలు, గ్రామ కమిటీలను వేయనున్నట్టు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ తీర్పును వ్యతిరేకిస్తూ గ్రామాల వారీగా పాదయాత్రలను చేపడుతూ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ఆర్టికల్ 341 ప్రకారం ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమన్నారు. అన్నాదమ్ముళ్లలా కలిసి ఉన్న దళితులను విడగొడుతున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాలల ఉద్యమంతో భూస్థాపితం కావడం ఖాయమన్నారు. మాలలపై విషం చిమ్ముతున్న కొన్ని పార్టీలకు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం చెబుతామన్నారు. మాల మహానాడు మండల అధ్యక్షుడు లక్కం బాబు, మాల మహానాడు నాయకులు తదితరులు ఉన్నారు.

అసభ్యకర పోస్టుపై పోలీసులకు ఫిర్యాదు

వీర్నపల్లి, సెప్టెంబరు 15 : ఉపాధ్యాయ సంఘానికి చెందిన గిరిజన నేత తండాను విమర్శిస్తూ వాట్సప్ గ్రూపులో అసభ్యకర పోస్టు పెట్టాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీర్నపల్లి మండలం అడవిపదిర లాల్ సింగ్‌తండా గ్రామ గిరిజనులపై ఉపాధ్యాయ సంఘానికి చెందిన ఓ గిరిజన నేత వాట్సప్ గ్రూపులో పోస్ట్ పెట్టాడంటూ మండిపడ్డారు. దీనిపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్‌లో తండావాసులు ఫిర్యాదు చేశారు. వ్యాఖ్యలకు బేషరతుగా వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ నేతను వివరణ కోరగా అనుకోకుండా పెట్టిన పోస్టుకు అదే గ్రూపులో క్షమాపణలు చెప్పానని, కొందరు ఉద్దేశపూర్వకంగా ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. గిరిజనులు తమ పోస్టును మన్నించాలని వేడుకున్నారు.

కేసీఆర్ కాలనీలో సమస్యలు పరిష్కరించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు, స్థానికులు

తంగళ్లపల్లి, సెప్టెంబరు 15: కేసీఆర్ నగర్ కాలనీ చెత్త చెదారంతో నిండిపోయిందని, కలెక్టర్ స్పందించి సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం తంగళ్లపల్లి మండలం మండేపల్లి శివారులోని కేసీఆర్ కాలనీ వాసులతో సీపీఎం నాయకులు సమావేశం నిర్వహించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకొని కాలనీ వాసులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలనీవాసులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వారికి మౌలిక వసతులు కల్పించాలని అన్నారు. కార్మికుల కాలనీని పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లను అందించిన స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ మౌలిక వసతులు కల్పించడంలో విఫలమయ్యారన్నారు. పక్షం రోజుల క్రితం కేసీఆర్ నగర్ కాలనీ నిర్వహణ చూడలేమని మున్సిపాల్ తీర్మానం చేసి చేతులెత్తేయడాన్ని కండించారు. మున్సిపల్, గ్రామ పంచాయతీ నిర్వహణ లేక పోవడంతో ఎక్కడి చెత్త అక్కడే నిలిచి పోయిందని, కేసీఆర్ కాలనీ మురికి కూపంలా తయారయ్యాయన్నారు. కాలనీ వాసులు విషజ్వరాల బారిన పడుతున్నారన్నారు. నేడు కాలనీ వాసుల సమస్యలపై కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించనున్నట్లు తెలిపారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కోడం రమణ, అన్నల్‌దాస్ గణేశ్, మూషం శంకర్, గోవింద్ లక్ష్మణ్, లక్ష్మణ్, కట్ట రవికుమార్, సామల కవిత, కోడం కవిత, శైలజ, జయ, అరుణ, మనోహర్, అంజనేయులు, అంబదాస్, నరేష్, కాలనీ వాసులు పాల్గొన్నారు.